క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఏకలవ్య మోడల్ గురుకుల కళాశాల, ఈఎంఆర్ఎస్ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి అర్హులైన గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన రీజినల్ కోఆర్డినేటర్ టి.హరిసింగ్ మంగళవారం తెలిపారు. పదో తరగతి టీసీ, మెమో, స్టడీ సర్టిఫికెట్లు, కులం, ఆదాయం, నివాసం, అన్ని ఒరిజినల్స్, నాలుగు పాస్‌ఫొటోలు, ఆధార్‌కార్డు, అన్ని సర్టిఫికెట్లు రెండు జిరాక్స్ సెట్లతో అడ్మిషన్ల కోసం కళాశాలలో హాజరుకావాలన్నారు. కురవి, సీరోలు, కొత్తగూడ, గూడూరు, బయ్యారంలో ఈఎంఆర్ఎస్, ఏకలవ్య మోడల్ గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూప్‌లో అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని ఇల్లెందు బైపాస్ రోడ్డు హీరో షోరూం ఎదురుగా ఆర్సీఓ కార్యాలయం సంప్రదించాలన్నారు.

భట్టికి ఘన స్వాగతం



మరిపెడ: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మరిపెడలో ఘనస్వాగతం పలికారు. జిల్లాలోని బయ్యారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసేందుకు హైదరాబాద్ నుంచి బయలుదేరి మరిపెడ మీదుగు వెళ్తున్న భట్టి విక్రమార్క మరిపెడలో కొద్ది సేపు ఆగారు. ఈక్రమంలో స్థానిక ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మండల అధ్యక్షుడు రఘు వీరారెడ్డి, రాంలాల్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



బయ్యారం: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రు నాయక్ అన్నారు. ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ముద్రించిన పోస్టర్లను మంగళవారం మండలంలోని లక్ష్మీనర్సింహాపురంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ రాంనాథ్ కేకన్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి, పరికిపండ్ల అశోక్ పాల్గొన్నారు.

హుస్సేన్ నాయక్ పూజలు



కొత్తగూడ: మండలంలోని గుండం శివాలయంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ మంగళవారం పూజలు నిర్వహించారు. కాకతీయ రాజులు నిర్మించిన శివాలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

నెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



కేసముద్రం: జనగాం జిల్లాలో ఈనెల 15వ తేదీ నుంచి 18వరకు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు పోటీల్లో పాల్గొనేందుకు మండలంలోని కల్వల జెడ్పీ హైస్కూల్‌లో మహబూబాబాద్ జిల్లా నెట్‌బాల్ జట్టును ఎంపిక చేసినట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేం.వాసుదేవరెడ్డి, తుమ్మ సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కబ్జాకు యత్నం

14 మందిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని జంగిలిగొండ గ్రామంలో గల తెలంగాణ క్రీడా ప్రాంగణం స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన 14మందిపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై వి.దీపిక మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన వడ్డెర కులస్తులు ఎల్లమ్మ దేవతను ప్రతిష్ఠించడానికి క్రీడా ప్రాంగణం ఆవరణలో షెడ్డు నిర్మాణం చేశారన్నారు. సంబంధిత అధికారులు వెళ్లి కార్యక్రమాన్ని అడ్డుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించటం నేరమని వారితో చెప్పగా పట్టించుకోలేదన్నారు. దీంతో కార్యదర్శి గవిని మహేష్ ఫిర్యాదు చేయగా మేరకు కేసు నమోదు చేశామన్నారు.

నియామక పత్రం అందజేత

కొత్తగూడ: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సిద్దబోయిన చందన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల హెచ్‌డబ్ల్యూఓగా భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు.

డంపింగ్ యార్డుకు స్థలం కొరత

- చెత్తకుప్పలుగా మారుతున్న చెరువులు
- దుర్గంధంతో ఇబ్బందులు

దోర్నకల్: దోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో చెత్తను నిల్వ చేసేందుకు డంపింగ్ యార్డు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆరేళ్ల క్రితం ఏర్పాటైన దోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 18వేల జనాభా ఉండగా 15వార్డులతో విస్తరించింది. గతంలో బుద్ధారం రోడ్డులో డంపింగ్ యార్డు ఉండగా దుర్గంధంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేయడంతో డంపింగ్ యార్డును తొలగించి పట్టణ ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు.

డంపింగ్ యార్డు ఏర్పాటుకు అడ్డంకులు..

మున్సిపాలిటీ ఏర్పడిన తరువాత అమ్మపాలెం గ్రామ సమీపంలోని రెండెకరాల ప్రభుత్వ భూమిలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. యార్డులో చెత్త పేరుకుపోతే తమకు అనారోగ్య సమస్యలు వస్తాయంటూ అమ్మపాలెం గ్రామస్తులు అభ్యంతరం తెలపడంతో యార్డు ఏర్పాటు పనులు నిలిచాయి.

చెత్త కుప్పలుగా చెరువులు..

మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డుకు స్థలం లేకపోవడంతో వీధుల నుంచి సేకరించిన చెత్తను బైపాస్ రోడ్డు పక్కన పెద్ద చెరువు స్థలంతోపాటు గొల్లచర్ల రోడ్డులోని బందంకుంట పక్కన నిల్వ చేస్తున్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్గంధం వస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు చెరువుల్లో చెత్తను వేస్తుండడంపై మత్స్యకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చెరువుల్లో నీరు కలుషితమవడంతో పాటు మత్స్య సంపదకు నష్టం వాటిల్లుతుందని వారు చెబుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 15వార్డుల నుంచి ప్రతీ రోజూ 2.5 నుంచి 3టన్నుల చెత్తను సేకరిస్తున్నట్లు మున్సిపాలిటీ సిబ్బంది చెబుతున్నారు. అధికారులు స్పందించి ఊరికి దూరంగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బందంకుంట పక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలు



పెద్ద చెరువులో చెత్తకుప్పలు

డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలి



మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డు లేకపోవడంతో రోడ్ల పక్కన చెత్త వేస్తున్నారు. బందంకుంట పక్కన చెత్త పేరుకుపోవడంతో కుంటలో నీరు కలుషితం కావడంతోపాటు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఊరికి దూరంగా డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలి.

– సాధనాల రాము, దోర్నకల్

కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

కేసముద్రం: కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని టీపీసీసీ పరిశీలకులు పొట్ల నాగేశ్వరరావు, కూచన రవళిరెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీసాయి గార్డెన్‌లో మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. కష్టకాలం నుంచి పార్టీ వెన్నంటి ఉంటూ, పార్టీ అభివృద్ధి కోసం శ్రమించిన ప్రతి ఒక్కరికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అలాంటి వారికే పార్టీ పదవులు దక్కుతాయన్నారు. అనంతరం కాంగ్రెస్ బ్లాక్, మండల, అర్బన్, గ్రామ అధ్యక్ష పదవుల కోసం ఆయా గ్రామాల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులు దరఖాస్తులను పరిశీలకులకు అందించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, గుగులోతు దస్రూనాయక్, బండారు వెంకన్న, కదిర సురేందర్, పోలెపాక నాగరాజు, రావుల మురళీ, తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రం: మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి

గూడూరు: కాంగ్రెస్ పార్టీలో గ్రామస్థాయి నుంచి మండల, బ్లాక్ విభాగాలలో పనిచేసే వారు నాయకత్వ లక్షణాలు కల్గి ఉండాలని సంస్థాగత ఎన్నికల అబ్జర్వర్లు పొట్ల నాగేశ్వర్‌రావు, రవళిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న అధ్యక్షతన మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే సంస్థాగత, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్ష, ఇతరులకు పదవులు పోకుండా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని సూచించారు. అందులో భాగంగా ముందుగా గ్రామ పార్టీ, మండల పార్టీ, బ్లాక్ విభాగాలలో అధ్యక్ష, కార్యదర్శులుగా పని చేయుటకు గ్రామాలలో ప్రజలతో మమేకమై ఉండే వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, నాయకులు మాధవ పెద్ది రమేశ్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వాంకుడోతు కొమ్మాలు, బీరం శ్రీపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాంబాబు

కురవి: రైతులు సేంద్రియ ఎరువులను వాడాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కేవీకే మల్యాల శాస్త్రవేత్త డాక్టర్ రాంబాబు అన్నారు. మంగళవారం సీరోలు మండలం కాంపల్లి గ్రామంలోని రైతువేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనం కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు తీసుకున్న రైతులు రశీదు తప్పనిసరిగా తీసుకుని భద్రపరుచుకోవాలన్నారు. వానాకాలంలో సాగు చేసే పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. పంటపొలాల్లో పశువుల పేడ వేయాలని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులైన జీలుగు, జనుము, పిల్లి పెసర వంటివి వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మరిపెడ ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి, మరిపెడ ఏడీఏ విజయ్‌చంద్ర, ఏఓ ఛాయారాజ్, హార్టికల్చర్ అధికారి శాంతిప్రియ, ఏఈఓలు భరత్, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల వరంగల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈమేరకు రైతువేదిక భవనంలో విద్యార్థులు తయారుచేసిన వ్యవసాయ పరికరాలను ప్రదర్శించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను తహసీల్దార్ రవీందర్ అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అనుమాండ్ల కిరణ్, అల్మాస్, శ్రీరాం, ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, గోపిక, రైతులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

నెల్లికుదురు: ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు మంజూరు చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు నల్లాని నవీన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈ మేరకు మంగళవారం మండలంలోని మునిగలవీడు గ్రామం నుంచి నెల్లికుదురు మండల కేంద్రం వరకు మోటార్ సైకిళ్లతో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు భూక్య సూర్య ప్రకాష్, నల్లాని ప్రవీణ్‌రావు, దేవేందర్, మంగయ్య, రమేష్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

కేసముద్రం: ఈనెల 20 చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను కార్మికులంతా కలిసి విజయవంతం చేయాలని ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రంవిలేజ్, ఉప్పరపల్లి గ్రామాల్లో గల ఐకేపీ సెంటర్‌లలో పనిచేస్తున్న కార్మికులతో సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పలుస సంపత్, కంకల శ్రీనివాస్, అంకిరెడ్డి వీరన్న, బీరయ్య, వెంకన్న, హేమలత, రాజు, డొనికెని రాజు, అనిల్, యాదగిరి, నగేష్, యాకయ్య, సంతోష్ పాల్గొన్నారు.



కేసముద్రం: మాట్లాడుతున్న కంచ వెంకన్న

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నెల్లికుదురు: లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేసి, కార్మిక చట్టాలను అమలు చేయాలని ఏఐటీయూ జిల్లా కార్యదర్శి రేషన్ పల్లి నవీన్ కుమార్ డిమాండ్ చేశాడు. ఈమేరకు మంగళవారం స్థానిక విశ్రాంతి భవనంలో ఈనెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇస్సంపల్లి సైదులు, బాబు గౌడ్, వరిపెల్లి వెంకన్న, ఆలకుంట్ల సాయన్న, లింగన్న, వెంకన్న, లక్ష్మీనర్సమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహబూబాబాద్: కేసముద్రం ఎంఎల్ఎస్ పాయింట్‌లోని సివిల్ సప్లయి కార్మికుల సమస్యల పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిడ్డి డిమాండ్ చేశాడు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం డీసీఎస్ఓ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్ మనోజ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు రావాల్సిన డబ్బుల విషయంలో తగ్గించే కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు జోక్యం చేసుకుని వెంటనే ఆసమస్య పరిష్కరించాలన్నారు. జిల్లాలోని అన్ని ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించాలని లేని యెడల ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించాడు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో హమాలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వడ్డెబోయిన లక్ష్మీనర్సయ్య, జక్కరయ్య, నాయకులు శేఖర్, భాస్కర్, పెరుగుకుమార్, శ్రావణ్, శ్రీను, రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తొర్రూరు రూరల్: మండలంలోని ఎర్రసోమ్లా తండా సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను లారీ ఢీకొట్టగా ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం పర్వతగిరి మండలంలోని ఈదులగడ్డ తండాకు చెందిన ధారావత్ రామ్‌ధన్‌నాయక్(45) తన బైక్‌పై పర్వతగిరి నుంచి తొర్రూరు మీదిగా తిరుమలగిరి వైపు టీక్యాతండాకు బంధువుల ఇంటికి వెళ్తున్నాడు. ముందు వెళ్తున్న కారును దాటివేసే ప్రయత్నం చేయగా, ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య మంగమ్మతోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..

పెద్దవంగర/తొర్రూరు రూరల్: బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని పాలకుర్తి నియోజకవర్గం ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొరిపల్లి గ్రామానికి చెందిన రంగు రమేశ్ మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే మండలంలోని చిట్యాలలో అనపురం పుల్లయ్య, పోచంపల్లి గ్రామంలో డిష్ వెంకన్న పలు కారణాలతో మృతి చెందాడు. వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ బాధిత కుటుంబాలకు కష్టకాలంలో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, సబిత, సైదులు, వీరా రెడ్డి, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఝాన్సీరెడ్డి

సంక్షిప్త సమాచారం

మౌలిక వసతులు కల్పించాలి



గూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో మౌలిక వసతులతోపాటు అభివృద్ధికి సహకరించాలని హెచ్ఎం సుజాత కోరారు. మండలంలోని మచ్చర్ల శివారు ఎన్‌హెచ్ రోడ్డు పక్కన గల జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ స్వగృహంలో మంగళవారం ఆమె కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆత్మహత్యాయత్నంపై విచారణ

దంతాలపల్లి: మండలం కుమ్మరికుంట్ల గ్రామంలో తన ధాన్యం తరలించడం లేదని సోమవారం రైతు యాకుబ్ ఆత్మహత్యాయత్నం చేసిన విషయం విధితమే. మంగళవారం పీఏసీఎస్ సీఈఓ తండా వెంకన్న గ్రామంలో పర్యటించి విచారణ చేపట్టారు.

పోలీస్ కళాజాతా

దంతాలపల్లి: గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు మూఢనమ్మకాలను నమ్మి ప్రాణనష్టం తెచ్చుకోవద్దని ఎస్సై పిల్లల రాజు అన్నారు. మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామంలో సోమవారం పోలీస్ ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు.

సద్వినియోగం చేసుకోవాలి

నర్సింహులపేట: ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కిన్నెర యాకయ్య అన్నారు. మండలంలోని దాసుతండాలో పనులను సీనియర్ మేట్ సక్రమంగా చేయించడం లేదని మంగళవారం పలువురు గ్రామస్తులు ఎంపీడీఓను కలిశారు.

కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

నెల్లికుదురు: మండలంలోని నర్సింహులగూడెం గ్రామ పరిధిలో లక్ష్మీ నర్సింహస్వామి జాతర, కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మామిడి తోరణాలతో మంగళవారం తోరణ మహోత్సవ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మద్దినేని అయిలయ్య యాదవ్, వైస్ చైర్మన్ వద్ది నాగరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీ

మరిపెడ: మరిపెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మరిపెడలోని ఉన్నత పాఠశాలలో గదుల కిటికీ చువ్వలు వంచి గుర్తు తెలియని వ్యక్తులు లోనికి చొరబడ్డారు. మరో రెండు గదుల తాళాలు పగులగొట్టి విద్యుత్ ఉపకరణాలను ధ్వంసం చేసి ఫ్యాన్‌లు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా తరగతి గదిలో ఉన్న డ్యూయల్ బెంచీలను పగులగొట్టారు. ఈవిషయమై పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

దుర్గమ్మ వేడుకలు

తొర్రూరు రూరల్: మండలంలోని టీక్యా, ఎర్రసోమ్లా తండాల్లో కొనసాగుతున్న దుర్గమ్మ వేడుకల్లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేయగా ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం నాయకులు వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.

టీడీపీ మండల కమిటీ నియామకం

పెద్దవంగర: టీడీపీ మండల అధ్యక్షుడిగా బైన భిక్షపతి నాలుగోసారి ఏకగ్రీవంగా నియమితులయ్యాడు. ఎన్నికల పరిశీలకుడు బొక్కరామచంద్రరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని ఎన్నికల ప్రక్రియ చేపట్టారు.

బయ్యారం: టీడీపీ మండల అధ్యక్షుడిగా వల్లమూడి కోటేశ్వరరావు ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రాజు, ప్రధాన కార్యదర్శి మోదుగుల శ్రీహరి, కార్యదర్శులు పట్టాబిరామయ్య, పాపారావు, కాలునాయక్, నరేష్, కోశాధికారిగా గంగావత్ ప్రవీణ్‌లను ఎన్నుకున్నారు.

బెంచీల ఏర్పాటు

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని పలు వీధుల్లో, వెటర్నరీ ఆసుపత్రి, దుర్గమ్మ గుడి ఆవరణంలో శివరాత్రి కొమురమ్మ జ్ఞాపకార్థం, అతడి మనుమలు చరణ్‌కుమార్, విజయ్‌కుమార్ రూ.15వేల విలువైన 6 సిమెంట్ బెంచీలను మంగళవారం ఏర్పాటు చేశారు.

వైభవంగా ప్రభబండ్ల ప్రదర్శన

గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆరోరోజు ప్రభబండ్ల ప్రదర్శన వైభవంగా జరిగింది. సాయంత్రం 6గంటలకు అశ్వవాహనంపై లక్ష్మీనారాయణ ఊరేగింపు బయలుదేరగా, గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన కుంచాల లక్ష్మణ్‌రాజ్ అనే వ్యక్తి అనారోగ్యానికి గురై బ్రెయిన్ సర్జరీ చేయాల్సి ఉండగా, దీనిపై స్పందించిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆపరేషన్‌కు కోసం రూ.2లక్షల ఎల్‌ఓసీని ప్రభుత్వం నుంచి మంజూరు చేయించాడు. మంగళవారం బాధితుడి భార్య జ్యోతికి అందజేశారు.

ఘన నివాళి

నెహ్రూసెంటర్: కార్మికులు తోట భిక్షం స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్ పిలుపునిచ్చారు. తోట భిక్షం వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపం వద్ద మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గునిగంటి రాజన్న, సమ్మెట రాజమౌళి, రావుల రాజు, హేమనాయక్, తోట యాకయ్య పాల్గొన్నారు.

ఏకలవ్యలో వందశాతం ఉత్తీర్ణత

కురవి: సీబీఎస్ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల కేంద్రం శివారులోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్(ఈఎంఆర్ఎస్) పాఠశాలలో పదో తరగతిలో వందశాతం ఫలితాలు వచ్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లాలు మంగళవారం తెలిపారు.

రైతు సమస్యలు తీర్చేందుకే నోటీసులు

దంతాలపల్లి: గ్రామీణ ప్రాంతాలలో రైతుల సమస్యలు తీర్చివారికి న్యాయం చేసేందుకే నోటీసులు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దారు సునీల్‌కుమార్ మంగళవారం తెలిపాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన భూభారతి చట్టంలో భాగంగా మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందన్నారు. అందులోని భాగంగానే మండలంలోని ఈనెల 5నుంచి 10 వరకు ప్రతి గ్రామంలో రెవిన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. సమస్యలు ఉన్న రైతులకు నోటీసులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆ భూములపై విచారణ చేపట్టనున్నట్లు తహసీల్దారు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కురవి: సీపీఐ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కురవి గ్రామ పార్టీ 9వ మహాసభ కార్యాలయంలో జరిగింది. ఈనెల 15న సీపీఐ మండల 9వ మహాసభలను అయ్యగారిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ శాఖ కార్యదర్శిగా తురక రమేశ్, సహాయ కార్యదర్శిగా కొణతం మహేష్‌లను ఎన్నుకున్నారు.

వసతులు లేక రైతుల అవస్థలు

- కానరాని టెంట్లు, తాగునీరు
- ఎండకు తల్లడిల్లుతున్న రైతులు
- మండలంలోని అన్నీ కొనుగోలు కేంద్రాల వద్ద ఇదే పరిస్థితి


పెద్దవంగర: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులకు ధాన్యం కొనుగోళ్ల ఏర్పాటుకు ముందు ఆదేశాలు జారీ చేసింది. కానీ మండలంలో ఇవి ఎక్కడ అమలు కావడం లేదు.

మండల కేంద్రంతోపాటు మండలంలోని బొమ్మకల్లు, కొరిపల్లి, పోచంపల్లి, ఉప్పరగూడెం, బంగారు చెలిమి, తండా, వడ్డెకొత్తపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో అవుతాపురం, బావోజీ తండా, చిట్యాల, గంట్లకుంట, పోచంపల్లి, వడ్డెకొత్తపల్లి , చిన్నవంగర, రామచంద్రు తండా, లొట్లబండ తండా, కాన్వాయి గూడెం తోపాటు పెద్దవంగర మండల కేంద్రంలో సైతం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం మండలంలో 18ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ కేంద్రాలల్లో ఇతర వసతుల కల్పన ప్రశ్నార్థకంగా మారింది. ఓ వైపు వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో పెరగడంతో ఉక్కిబిక్కిరి అవుతుండగా.. మరో వైపు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నీడ.. తాగేందుకు నీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ధాన్యానభద్రపర్చడానికి సరైన షెడ్లు, ఇతర ఏర్పాట్లు ఉంటే అకాల వర్షంతో ధాన్యం తడిసిపోకుండా, నాణ్యత తగ్గకుండా వీలుంటుంది. కేంద్రాల్లో ధాన్యం సేకరణలో నిబంధనల పేరిట కొందరు కొర్రీలు విధిస్తున్నారు. దీంతో రైతులు రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. చాలా చోట్ల నామమాత్రంగా తడికెలతో పందిర్లు ఏర్పాటు చేసినా అవి ఏమాత్రం అనుకూలంగా లేవు. విధిలేక చెట్ల నీడలో తల దాచుకుంటున్నారు.



పోచంపల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రంలో నీడ కోసం వేసిన పందిరి

ఇబ్బందులు లేకుండా చూస్తాం..



మండల వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిబంధనల మేరకు కనీస వసతుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. ఎండ తీవ్రత పెరుగుతుండడంతో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సైతం అందుబాటులో పెట్టాం. టెంట్లు కూడా అందుబాటులో పెట్టాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– రమణాచారి, ఏపీఎం, పెద్దవంగర

నల్లబెల్లం, పటిక పట్టివేత



నెల్లికుదురు: అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటిక సీజ్ చేసి ముగ్గురుపై కేసు నమోదు చేసిన సంఘటన కాచికల్ క్రాస్ రోడ్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారంతో కాచికల్ క్రాస్ రోడ్ వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న బజాజ్ ట్రాలీ ఆటో తనిఖీ చేయగా రూ. లక్ష విలువ చేసే 10బస్తాల నల్లబెల్లం , 10బస్తాల పటిక బెల్లం ఉన్నట్లు గుర్తించామన్నారు. ట్రాలీని సీజ్ చేసి భూక్య వినోద్, బానోతు రవి, గుగులోతు అశోక్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్సై శివరామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.